ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 మహబూబాబాద్

ఆదివారం 6 అక్టోబరు 2024



నేడు సదరం స్లాట్ బుకింగ్ ప్రారంభం

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 5 : దివ్యాంగ నిర్ధారణ, సర్టిఫికెట్ల మంజూరు కోసం ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు సదరంస్లాట్ బుకింగ్ ప్రారంభమవుతుందని డీఆర్‌డీఏ పీడీ మధుసూదన్‌రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9న రెన్యూవల్స్ కోసం 150మందికి, 16న కొత్తవి 150 మందికి, 23న రెన్యూవల్స్ 150 మందికి, 30న కొత్తవి 150 వెరసి600 మందికి (మానసిక, శరీరక, చెవుడు, మూగ, కంటిచూపు సమస్య) ఉన్నవారికి దివ్యాంగ వైద్య నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. సదరం సర్టిఫికెట్ కావాల్సిన అభ్యర్థులు మీసేవ కేంద్రాలకు స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. మీసేవ కేంద్రాల్లో కేటాయించిన తేదీల్లో అభ్యర్థులు జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వచ్చి వైద్య నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు.



లోహపు కళారూపాల తయారీలో నిమగ్నమైన పెంబర్తి కళాకారులు

Sunday SPECIAL

అద్భుతాల కళబోత

చేనేత, హస్తకళా వైభవం ఓరుగల్లు సొంతం

- లోహపు కళారూపాల తయారీకి ప్రసిద్ధి పెంబర్తి
- చేనేత కార్పెట్లు, తివాచీలకు నిలయం వరంగల్ కొత్తవాడ
- కళను భావి తరాలకు అందించేలా కేంద్రం కార్యాచరణ
- ఉత్పత్తి, ఉపాధి పెంచేలా హ్యాండీక్రాఫ్ట్ క్లస్టర్ల ఏర్పాటు
- 'స్ఫూర్తి' పథకం కింద నిధుల కేటాయింపు
- ఉత్పత్తి, ఉపాధి పెంచేలా ప్రణాళికలు


7

కాకతీయుల కాలం నాటి కళా నైపుణ్యం.. ప్రపంచ వారసత్వ సంపదను తన కీర్తి సిగలో ఇముడ్చుకున్న ఉమ్మడి ఓరుగల్లు.. చేనేత, హస్తకళా వైభవంలోనూ మేటిగా నిలిచింది. అందుకు నిదర్శనమే జనగామ జిల్లా పెంబర్తిలో విశ్వకర్మలు ఇత్తడి, రాగి, వెండి లాంటి లోహాలతో తయారు చేసే కళారూపాలు, వరంగల్ కొత్తవాడ ప్రాంతంలో చేనేత కళాకారుల కండ నరాల నుంచి రూపుదాల్చే కార్పెట్లు, తివాచీ(దర్రీస్)లు. మన జిల్లా కార్మికుల చేతిలో తయారయ్యే ఈ కళాకృతులకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి గుర్తింపే ఉంది. ప్రస్తుతం కనుమరుగవుతున్న ఇలాంటి సంప్రదాయ హస్తకళలను కాపాడుకుంటూ భావితరాలకు అందించేందుకు కేంద్రప్రభుత్వం నడుంబిగించింది. ఏయే ప్రాంతాల్లో ఏయే చేనేత, హస్తకళలు ప్రాచుర్యం పొందాయో.. ఆ ప్రాంతాల్లోని కళాకారులకు వృత్తి శిక్షణనిచ్చి ప్రోత్సహించనుంది. ఇందుకు హ్యాండీక్రాఫ్ట్ క్లస్టర్లను ఏర్పాటు చేసి స్ఫూర్తి పథకం కింద నిధుల కేటాయించి హస్తకళల ఉత్పత్తి, కళాకారులకు ఉపాధి కల్పించాలని సంకల్పించింది.

- జనగామ (ఆంధ్రజ్యోతి)/ ఆటోనగర్



ప్రముఖుల ఫొటోలతో వరంగల్ కొత్తవాడ చేనేత కార్మికులు నేసిన కార్పెట్లు



మగ్గం నేస్తున్న చేనేత కార్మికుడు



ఫాతిమా హైస్కూల్‌లో డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రాన్ని సందర్శిస్తున్న రాజేశ్వర్

ముగిసిన డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

- 896 మంది పత్రాల పరిశీలన పూర్తి
- జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 5: మానుకోట పట్టణంలోని ఫాతిమా హైస్కూల్‌లో ఈనెల 1న ప్రారంభమైన డీఎస్సీ-2024 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శనివారంతో ముగిసింది. ఐదు రోజులుగా 20 బృందాల ద్వారా ప్రత్యేక పరిశీలన కేంద్రాలను ఏర్పాటు చేసి, అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 381 స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్స్, తెలుగు, హిందీ పండిట్, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులకు 1:3 నిష్పత్తిలో 992 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించాల్సి ఉండగా 896 మంది హాజరైనట్లు తెలిపారు. వీరిలో ఎస్ఏ విభాగంలో 18 మంది, ఎల్‌పీలో 04, పీఈటీలో 03, ఎస్జీటీలో 63 మంది మొత్తం 94 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఈ పరిశీలనలో ఏసీజీఈ మందుల శ్రీరాములు, డీఎస్వో అప్పారావు, సూపరింటెండెంట్ ఉమామహేశ్వర్, ఎంఈవోలు, కోఆర్డినేటర్లు ఆజాద్ చంద్రశేఖర్, విజయకుమారి, సంతోష్, షాబీర్ అలీ, హరిత, శ్రీనివాసులు పాల్గొన్నారు.

శ్రీవేట వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి పాటుడాలి

- దేవాలయానికి దాతల సహకారం అవసరం
- ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

8



స్థానిక సంస్థల ఎన్నికలెప్పుడో?

- కులగణన తర్వాత అంటున్న సర్కార్
- ఫిబ్రవరి 2న ముగిసిన పంచాయతీ పాలకమండళ్ల పదవీ కాలం
- గ్రామాల్లో ఎనిమిది నెలలుగా ప్రత్యేకాధికారుల పాలన
- పల్లెల్లో కుంటుపడుతున్న అభివృద్ధి
- ఆశావాహుల ఎదురుచూపు, సందిగ్ధంలో రిజర్వేషన్లు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 5 : స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పట్లో లేనట్లేనా అన్న ప్రశ్నకు ఔననే సమాధానం కన్పిస్తోంది. గ్రామ పంచాయతీ పాలక మండళ్ల పదవీకాలం ఫిబ్రవరి 2వ తేదీతో పూర్తి కావడంతో ఇప్పటికే ఏనిమిది నెలలు దాటి పోయింది. సర్పంచ్ పదవీకాలం అయిపోయాక పల్లె బాగోగులు చూసుకున్నఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీ కాలం కూడా పూర్తయి రెండునెలలు కావస్తోంది. దీంతో ఇక గ్రామాలను చూసుకునే పెద్ద (ప్రజాప్రతినిధులు) కరువయ్యారు. ప్రజాప్రతినిధులు లేక పోవడంతో పల్లెలను పట్టించుకునే నాథుడే లేరంటే ఆశ్చర్యం లేక పోలేదు. పాలకమండళ్ల పదవీ కాలం పూర్తికాగానే రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీకి ఒక ఉద్యోగిని ప్రత్యేకాధికారిని నియమించారు. వారి శాఖపరమైన విధులతో పాటు అదనంగా ప్రత్యేకాధికారులుగా నియమించడంతో గ్రామాల్లో పర్యవేక్షణకు రాక పరిశీలన కొరవడి అభివృద్ధిపై దృష్టి సారించలేక పోవడంతో పల్లెల్లో ప్రగతి కుంటుపడుతోంది. ఈ క్రమంలో భారమంతా పంచాయతీ కార్యదర్శులపైనే పడింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామాల్లో చెరువులు, కుంటల కట్టలు తెగిపోవడం, రోడ్లు దెబ్బతినడంతో పాటు సీజనల్ వ్యాధులు ప్రబలడంతో ప్రజలంతా అతలాకుతలమయ్యారు. పంచాయతీలకు ప్రజాప్రతినిధులు లేక పోవడంతో ప్రజలను పట్టించుకునే వారు కరువవయ్యారు.

గ్రామసర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ పదవీ కాలాలు పూర్తయినప్పటికి స్థానిక సంస్థలఎన్నికలకు మాత్రం ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ రాలేదు. అసెంబ్లీ ఎన్నికల ముందు హామీ ఇచ్చినవిధంగా కులగణనకు రాష్ట్ర సర్కార్ కట్టుబడి ఉందని, కులగణన పూర్తయ్యాక ఎన్నికలు నిర్వహిస్తామని పలువురు ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాక స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తులు చేస్తున్నట్లు సమాచారం. బీసీల కులగణన కోసం బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేశారని చర్చ జరుగుతోంది. ఇప్పటి వరకు కులగణనపై మార్గదర్శకాలు విడుదల చేయకపోవడంతో ఆ ప్రక్రియ ఆలస్యమవుతోంది. ఎన్నికల అధికారులు మాత్రం స్థానికసంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చిననిర్వహించేలా ఓటరు జాబితాను పూర్తిచేసి సిద్ధంగా ఉన్నారు.

8 నెలలుగా ప్రత్యేకాధికారుల పాలన

ఫిబ్రవరి మాసం ఆరంభంతో గ్రామ పంచాయతీల పాలకమండళ్ల పదవీకాలం పూర్తి కావడంతో నాటి నుంచి ఏనిమిది నెలలుగా పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యవేక్షణ కొరవడడంతో పల్లెప్రగతి కుంటు పడింది. గత సంవత్సరం నవంబర్ మాసంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో, మేలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రెండుఎన్నికలు కలిపి దాదాపు నాలుగునెలల పాటు ఎన్నికల కోడ్ ఉండడంతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు కూడా ఆటంకం ఏర్పడింది. ఆ తర్వాత రాష్ట్రం లో కొత్తగా ఏర్పడ్డ సర్కార్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తూ వచ్చింది. ఈ క్రమంలో గ్రామాల్లో నామమాత్రపు నిధులతో అభివృద్ధి అంతంత మాత్రమేనని చెప్పవచ్చు. మరోపక్క గ్రామాల్లో పంచాయతీ పాలకమండళ్లు లేకపోవడంతో వాటి అభివృద్ధిపై ప్రణాళిక రచించి, కృషి చేసేవారు లేరు.

ఎదురుచూస్తున్న ఆశావహులు

గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉత్సాహంగా ఉన్న వాళ్లంతా ఎన్నికల ఎప్పుడొస్తాయా అనిఎదురు చూస్తున్నారు. గతంలో ఉన్న రిజర్వేషన్ కొనసాగుతుందా లేక రిజర్వేషన్ల మారుతుందాఅనే సందిగ్ధంలో ఉండి ముందుకు కదలలేకపోతున్నారు. మహబూబాబాద్ జిల్లాలో 18 మండలాల పరిధిలో గతంలో 461 గ్రామ పంచాయతీలుండగా, అదనంగా 26 పెరగడంతో జీపీల సంఖ్య 487కు పెరిగింది. గతంలో 4,030 వార్డులుండగా ప్రస్తుతం 4,056కు పెరిగాయి. ఇక జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 198 ఎంపీటీసీ స్థానాలున్నాయి. ఇదివరకు 16 జడ్పీటీసీ స్థానాలుండగా డోర్నకల్ నియోజకవర్గ పరిధిలో సీరోలు, మానుకోట నియోజకవర్గ పరిధిలో ఇనుగుర్తి కొత్త మండలాలుగా ఆవిష్కృతం కావడంతో అవి 185కు చేరుకోనున్నాయి. ఇక ఓటర్లు 5,51,469 మంది ఉండగా అందులో పురుషులు 2,71,559 మంది స్త్రీలు 2,79,885 మంది, ఇతరులు 25 మంది ఉన్నట్లు అధికారులు ఓటరు జాబితాను సిద్ధం చేశారు.

బీసీ కులగణన పూర్తయితే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతో బీసీ ప్రజా ప్రతినిధులు పెరిగే అవకాశం ఉంటుంది. ఏది ఏమైనప్పటికి గ్రామ పంచాయతీలకు పాలకమండళ్ల లేక పోవడంతో పాలన కొరవడిందని, త్వరగా స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించి గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- రైతులకు రూ.2లక్షల రుణమాఫీపై మోసం
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

వివరాలు 8లో





అశ్రునయనాల మధ్య నూకల నరేశ్‌రెడ్డి అంత్యక్రియలు

- తరలివచ్చిన వేలాదిమంది అభిమానులు, ప్రజలు
- నివాళి అర్పించిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు
- అంతిమయాత్రలో పాల్గొన్న ప్రముఖులు, నాయకులు



అంత్యక్రియలకు హాజరైన మంత్రి పొంగులేటి, ఎంపీ, ఎమ్మెల్యేలు, నేతలు



పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల



పాడె మోస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

మరిపెడ, అక్టోబరు 5 : కాంగ్రెస్ సీనియర్ నేత నూకల నరేశ్‌రెడ్డి అంత్యక్రియలు అభిమానుల అశ్రునయనాల మధ్య శనివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెంలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో పూర్తయ్యాయి. నరేశ్‌రెడ్డి అంత్యక్రియలకు ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి పార్టీలకతీతంగా నేతలు, అభిమానులు తరలొచ్చారు. ఆయనకు నివాళులర్పించిన అభిమానులు, ప్రజలు, గ్రామస్థులు కంటతడి పెట్టారు. ఆయన నుంచి సాయం పొందిన చుట్టపక్కల గ్రామాల గిరిజనులు బోరున విలపించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఆర్.సురేందర్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, ప్రభుత్వవిప్ రాంచంద్రునాయక్, మహబూబాబాద్, ఖమ్మం ఎంపీలు బలరాంనాయక్, రఘురామ్‌రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నరేశ్‌రెడ్డి భౌతికాయం వద్ద నివాళులర్పించారు. అలాగే మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, జగదీశ్‌రెడ్డి, పరకాల, మహబూబాబాద్, ఇల్లెందు ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మురళీనాయక్, కోరం కనకయ్యతో పాటు తదితర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సత్యవతి, రవీందర్‌రావు, ఎమ్మెల్సీలు, మహబూబాబాద్ మాజీ ఎంపీ మాలోత్ కవిత, వరంగల్ మాజీమేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, వరదరాజేశ్వర్‌రావు, రెడ్యానాయక్, శంకర్‌నాయక్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, మహబూబాబాద్ గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నవీన్‌రావు, కాంగ్రెస్ నేతలు యుగేందర్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, మరిపెడ మునిసిపల్ చైర్మన్ సింధూరకుమారి, మాజీ ఎంపీపీ అరుణరాంబాబు, మాజీ జడ్పీటీసీ శారదరవీందర్, అచ్యుత్‌రావు, తాళ్లపెల్లి శ్రీనివాస్, సీపీఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి తదితరులు హాజరై నూకల నరేశ్‌రెడ్డికి నివాళులర్పించారు.

కేటీఆర్, హరీశ్‌రావు, పీసీసీ చీఫ్ మహేష్ సంతాపం

హైదరాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నూకల నరేష్‌రెడ్డి మరణం పట్ల బీఆర్ఎస్‌వర్కింగ్ ప్రెసిడెంట్ కెటీఆర్, మాజీమంత్రి హరీశ్‌రావు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం ప్రకటించారు. తెలంగాణ ఉద్యమ కాలంలో, ఆతర్వాత పార్టీలో పనిచేసిన నరేశ్‌రెడ్డితో ఉన్న అనుబంధాన్ని వారు గుర్తు చేసుకున్నారు ఆయన మృతి బాధాకరమని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, మంచి నాయకుడిగా ప్రజాదరణ పొందారని పేర్కొన్నారు. ఆయనకుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే టీపీసీసీ అధ్యక్షుడు జి. మహేష్‌కుమార్ గౌడ్ మరో ప్రకటనలో సంతాపం ప్రకటించి.. నరేశ్‌రెడ్డి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

అద్భుతాల కళబోత

- చేనేత, హస్తకళా వైభవం ఓరుగల్లు సొంతం
- ఉత్పత్తి పెంచేలా కేంద్ర ప్రభుత్వ ప్రణాళికలు
- హ్యాండీక్రాఫ్ట్ క్లస్టర్ల ఏర్పాటు
- 'స్ఫూర్తి' పథకం కింద నిధుల కేటాయింపు

సండే స్పెషల్ SUNDAY SPECIAL



పెంబర్తి క్లస్టర్ కేంద్రంలో అమ్మకానికి ఉంచిన కళాకృతులు

జనగామ (ఆంధ్రజ్యోతి)/ ఆటోనగర్, అక్టోబరు 5 : మన సంప్రదాయ చేనేత, హస్తకళలను కాపాడుకోవడంతో పాటు వాటిని భావితరాలకు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఇందుకోసం దేశవ్యాప్తంగా ఉన్న హస్తకళాకృతులపై అధ్యయనం చేయడంతో పాటు ఆయా కళల్లో విశిష్టత కల్గిన ప్రాంతాల అభివృద్ధిపై సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ దృష్టి సారించింది. ఏయే ప్రాంతాల్లో ఏయే హస్తకళలు ప్రాచుర్యం పొందాయో ఆయా ప్రాంతాలను క్లస్టర్లుగా ప్రకటించి.. అక్కడి ప్రాంతాల్లోని కళాకారులకు నైపుణ్య శిక్షణ, కొత్త కళాకారులకు వృత్తి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. స్ఫూర్తి పథకం కింద హస్తకళాకారుల సంఘాలకు నిధులు కేటాయించి హస్తకళల ఉత్పత్తి, కళాకారులకు ఉపాధి పెంచడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి జనగామ జిల్లాలోని పెంబర్తి లోహపు హస్తకళ, వరంగల్ కొత్తవాడలోని చేనేత కార్పెట్లు, తివాచీ(దర్రీస్)ల తయారీలను క్లస్టర్లుగా ఏర్పాటు చేసింది.

హస్తకళలకు కీర్తి.. పెంబర్తి

జనగామ మండలంలోని పెంబర్తి గ్రామం ఇత్తడి, రాగి, వెండి లాంటి లోహాలతో తయారు చేసే హస్త కళలకు ప్రసిద్ధి. ఈ గ్రామంలోని విశ్వకర్మలు తయారు చేసే హస్తకళా ఉత్పత్తులకు దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు విదేశాల్లోనూ మంచి డిమాండ్ ఉంది. యాదాద్రి ఆలయ పునర్నిర్మాణంలో గర్భగుడి ఆలయ ద్వారాలకు ఏర్పాటు చేసిన స్వర్ణతాపడాలు పెంబర్తి విశ్వకర్మల చేతుల్లో రూపుదిద్దుకున్నవే. 800ఏళ్ల క్రితం పురుడుపోసుకున్న ఈ హస్తకళ ప్రపంచ ఖ్యాతి గడిచింది. లోహాలను కరగదీసి రేకులుగా మలిచి దేవతామూర్తుల విగ్రహాలు, కలశాలు, ధ్వజస్తంభ గోపురాలు, ఆలయ గర్భగుడి ద్వారాలకు తాపడాలను తయారు చేస్తుంటారు. పెంబర్తిలో మొదట్లో హస్తకళల కుటుంబాలకు 200పైగా ఉండగా ప్రస్తుతం ఈ వృత్తి నిర్వహించే వారి సంఖ్య తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం గ్రామంలో వంద కుటుంబాలు ఈ పని మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. మొదట్లో విశ్వకర్మ కుటుంబాల వారే ఈ పని చేయగా కాలక్రమంగా ఇతర కులాలకు చెందిన వారు కూడా వృత్తిని నేర్చుకున్నారు. అయితే ఈ పెంబర్తిలో హస్తకళా క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని 2017లోనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయించి.. స్కీమ్ ఆఫ్ ఫండ్ ఫర్ రీజనరేషన్ ఆఫ్ ట్రెడిషనల్ ఇండస్ట్రీస్ (స్ఫూర్తి) పథకం కింద రూ.1.85 కోట్లను కేటాయించింది. ఇందులో రూ.31లక్షలు విశ్వకర్మల వాటా కాగా మిగతా రూ. 1.54కోట్లు ప్రభుత్వం రాయితీపై ఇచ్చింది. విశ్వకర్మల వాటా చెల్లింపులో ఆలస్యంగా కారణంగా ఐదేళ్ల కస్టర్ల అభివృద్ధి ఆలస్యమవుతూ వచ్చింది. రూ.1.85 కోట్లలో విశ్వకర్మ బ్రాస్, కాపర్, సిల్వర్ ఇండస్ట్రియల్ కోఆపరేటివ్ సొసైటీ బిల్డింగ్ నిర్మాణానికి రూ.40లక్షలు కాగా.. మిగతా వాటితో అవసమైన యంత్రాల కొనుగోలుకు కేటాయించారు. హస్తకళల ఉత్పత్తిని పెంచాలంటే యంత్రాల వినియోగం అవసరం. దీని దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం యంత్రాల కొనుగోలుకు నిధులు కేటాయించింది. ఈ నిధులతో షీట్ కటింగ్, వుడ్ కటింగ్, బెండింగ్, షేపింగ్, పాలిషింగ్, ఎలక్ట్రో ప్లేటింగ్ యంత్రాలను పెంబర్తి విశ్వకర్మ సొసైటీ కొనుగోలు చేసింది. బిల్డింగ్ నిర్మాణం పూర్తి కావడంతో అందులోనే హ్యాండీక్రాఫ్ట్ సేల్స్ కౌంటర్‌ను ఇటీవలే ప్రారంభించారు.

కార్పెట్లు, దర్రీస్.. కొత్తవాడ చేనేత ప్రత్యేకత

ఓరుగల్లు.. చేనేత ఉత్పత్తులకు పెట్టింది పేరు. కార్పెట్లయినా, దర్రీస్(తివాచీ)లైనా దేశవిదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. వరంగల్ జిల్లా కొత్తవాడ ప్రాంతంలోని నేతన్నలు మగ్గంపై నేసినవి చూస్తే.. వారి అద్భుత కళను ఔరా అనాల్సిందే. ఇక్కడ సుమారు 2వేల మంది చేనేత కార్మికులు ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. సుమారు మూడు దశాబ్దాల క్రితం ఈ ప్రాంతంలో సుమారు 10వేల మంది కార్మికులు మగ్గం వృత్తిపై ఆధారపడేవారు. కాలక్రమేణా ఆ సంఖ్య తగ్గుతూ వచ్చింది. ఇక్కడి నేతన్నలు నేసిన కార్పెట్లు, దర్రీస్‌లు యూరప్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, నేపాల్, జర్మనీ, స్విట్జర్లాండ్ లాంటి ఎగుమతవుతుంటాయి. నెలకు ఐదు వేల పీసుల వరకు ఆర్డర్లు వస్తుంటాయి. వీరు తయారు చేసే కలంకారి దర్రీస్, కీలం కాటన్ దర్రీస్, జూట్ దర్రీస్ అంటే దేశ, విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. ఆకులు, నిమ్మకాయలు, బెల్లం, ఇనుము, కరక్కాయలు, పండ్ల రసాలతో తయారు చేసిన రంగులతో కలంకారి దర్రీస్‌లు నేయడం ఇక్కడివారి ప్రత్యేకత. కీలం కాటన్ డిజైన్‌ను చేనేత కార్మికులు చేతులతో నేస్తారు. జనపనారతో తయారు చేసిన రంగులతో జూట్ దర్రీస్‌ను తయారు చేస్తారు. ఇలా తయారు చేసిన వాటిలో వంద శాతం కాటన్ ఉంటుంది. ఈ మూడు డిజైన్లు విదేశాలకు ఎగుమతవుతాయి.

చేనేత కార్మికులకు చేయూత

వరంగల్ ఉమ్మడి జిల్లాలో 36చేనేత సహకార సంఘాలు, 36 చేనేత పరస్పర సహకార సంఘాలు ఉండగా వీటిలో 20చేనేత సహకార సంఘాలు కేవలం కొత్తవాడలోనే ఉన్నాయి. ఇక్కడ దాదాపు 2వేల మంది కార్మికులున్నారు. ప్రతీ 100మందికి ఓ సంఘం ఉంది. ఈ సహకార సంఘాల ద్వారా చేనేత కార్మికుల ఆర్థిక సహాయాలు, ప్రభుత్వం నుంచి దేశ విదేశాల ఆర్డర్లు ఇప్పించడం, నేత సామగ్రి, పరికరాలను సబ్సిడీపై ఇప్పించడం లాంటి చేస్తే చేనేత వృత్తి ప్రపంచ వ్యాప్తంగా మరింత గుర్తింపు పొందుతుందన్న అభిప్రాయాలున్నాయి.

ప్రముఖుల ఫొటోలతో తివాచీలు

మూడు పీట్ల వెడల్పు, ఆరు పీట్ల పొడవు కలిగిన కార్పెట్ కిలోబరువు ఉంటుంది. విదేశాలకు ఎగుమతి చేసే దర్రీస్‌లు మూడు అడుగుల వెడల్పు, ఐదు అడగుల పొడవు, కిలోన్నర బరువు ఉంటాయి. ఇక్కడి నేత కార్మికులు ప్రముఖుల ఫొటోలతో కూడా దర్రీస్‌లను తయారు చేస్తారు. మహాత్మగాంధీ, మదర్ థెరిస్సా, రాజీవ్‌గాంధీ, వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి, నరేంద్రమోదీ, క్రికెటర్ సచిన్ టెండూల్కర్, ప్రస్తుత సీఎం ఎ.రేవంత్‌రెడ్డి చిత్రాలతో పాటు చార్మినార్ లాంటి కట్టడాలను డిజైన్లుగా మలిచే ప్రత్యేకత వీరి సొంతం. ఇక్కడ తయారైన ఎర్రతివాచీలు అత్యధిక ప్రభుత్వ ప్రైవేటు వేడుకల్లో వినియోగిస్తూ ఉంటారు. కొత్తవాడ నుంచి పిట్ట రాములు అనే చేనేత కార్మికుడు రాష్ట్రపతి చేనేత అవార్డును అందుకున్నారు. ఇక 2023లో హైదరాబాద్‌లోని జేడీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైన్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యాషన్‌షోలో ఇక్కడి కార్పెట్లను తమ ప్రతిభతో ఫ్యాషనెబుల్‌గా తయారుచేసి ఫ్యాషన్ షోలో ప్రదర్శించారు.



కాటన్ జూట్ దర్రీస్



పెంబర్తి హస్తకళలో శిక్షణ పొందిన మహిళలు, వారు తయారు చేసిన వస్తువులు (ఫైల్)



మగ్గం నేస్తున్న చేనేత కార్మికుడు



రాట్నంపై కండెలు చుడుతున్న చేనేత మహిళా కార్మికురాలు

అధునాతన మగ్గాలు ఏర్పాటు చేయాలి

పిట్ట రాములు, రాష్ట్రపతి చేనేత అవార్డు గ్రహీత



రాబోయే చేనేత కార్మికుల కోసం అధునాతన మగ్గాలను, తివాచీలకు వేసే కలర్ యంత్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం ఉన్న చేనేత కార్మికులంతా వయసు మీద పడ్డవారున్నారు. దీని వల్ల చేనేత కళ అంతరించిపోయే ప్రమాదం ఉంది. చేనేత కార్మికులకు ప్రభుత్వం హెల్త్‌కార్డులు మంజూరు చేయాలి.

కళాకారులకు శిక్షణ

హస్తకళాకారులకు వృత్తిలో నైపుణ్యాన్ని పెంచాలన్న లక్ష్యంతో శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సెప్టెంబరు 2న పెంబర్తికి చెందిన సీనియర్ హస్తకళాకారుడు అయిలా సోమనర్సింహాచారి నేతృత్వంలో ఈ శిక్షణ ప్రారంభమవగా ప్రస్తుతం ముగింపు దశలో ఉంది. త్వరలోనే ఆసక్తి ఉన్న కొత్త కళాకారులను గుర్తించి శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే హస్తకళల ఉత్పత్తులను ఆన్‌లైన్ ద్వారా, హ్యాండీక్రాఫ్ట్ కౌంటర్ల ద్వారా అమ్మకాలు చేయించి కళాకారులకు మరింత ఆర్థిక భరోసా కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది.



మానుకోటలోని వికాస్ విద్యాసంస్థల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కరస్పాండెంట్ బిక్కి వెంకటేశ్వర్లు, చైర్మన్ ఇందిర



నలంద డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కళాశాల డైరెక్టర్ డోలి సాధన, విద్యార్థినులు

కళాశాలల్లో బతుకమ్మ సంబురాలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 5 : జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం నాలుగో రోజు బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. కళాశాల డైరెక్టర్ డోలి సాధన, మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు తీరొక్కపూలతో బతుకమ్మలను పేర్చి ఉయ్యాల పాటలు, కోలాటం వేసి ఆనందోత్సవాల నడుమ వేడుకలు జరుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ఉద్యమం, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రసాధనలో బతుకమ్మ పాటలు ఎంతగానో ప్రజలను చైతన్యం చేశాయని పేర్కొన్నారు. కళాశాలలో వివిధ పండుగలను నిర్వహిస్తూ విద్యార్థినీ, విద్యార్థులకు పర్వదినాల విశిష్టత, ప్రాముఖ్యతలను భావితరాలకు తెలియజేసేందుకు పాటుపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రిన్సిపాళ్లు కృష్ణప్రసాద్, గట్ల శ్రీపాల్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కె.బి.శంకర్, అధ్యాపకులు కృష్ణారావు, రేణుక, ప్రసాద్, నరేష్, రమేష్, రాజు, రవిశంకర్, గౌస్‌పాషా, ముత్తయ్య, బిక్షం, శేఖర్ పాల్గొన్నారు.

● జిల్లా కేంద్రంలోని వికాస్ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో కళాశాల చైర్మన్ బిక్కి ఇందిర నేతృత్వంలో విద్యార్థినులు బతుకమ్మలను పేర్చి ఆటా.పాటలతో వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ బిక్కి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... తొమ్మిది రోజుల పాటు మహిళలు, యువతులు, చిన్నారులు అనే తేడాలేకుండా బతుకమ్మలను పేర్చి నృత్యా లు చేస్తూ వేడుకలు జరుపుకుంటారని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ వీరయ్య, అధ్యాపకులు నీలం వెంకన్న, ఆసియా నస్రిన్, సునీత, చేపూరి వెంకన్న, యుగందర్, కిషన్, కృష్ణమాచారి, శ్రీనివాస్, వెంకటేశం, విజయ్, నాగనరేష్, రాజు, సారంగం, యాకన్న, బిక్షమయ్య పాల్గొన్నారు.

ట్రాక్టర్ సాయంతో వాగులు దాటుతూ

దొరవారి తిమ్మాపురానికి అధికారులు

● గ్రామాన్ని సందర్శించిన ఆర్డీవో, తహసీల్దార్

● పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ



ట్రాక్టర్ సాయంతో దొరవారితిమ్మాపురానికి వెళ్తున్న ఆర్డీవో ఆలివేలు, తహసీల్దార్ శ్వేత



ట్రాక్టర్ సాయంతో దొరవారితిమ్మాపురానికి వెళ్తున్న ఆర్డీవో ఆలివేలు, తహసీల్దార్ శ్వేత

గూడూరు, అక్టోబరు 5 : అటవీ మార్గం ద్వారా ట్రాక్టర్ సాయంతో వాగులు దాటుతూ.. మట్టేవాడ శివారు దొరవారితిమ్మాపురం గ్రామానికి శనివారం మహబూబాబాద్ ఆర్డీవో ఎల్.ఆలివేలు, గూడూరు తహసీల్దార్ ఎస్.శ్వేత చేరుకున్నారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశాల మేరకు దొరవారితిమ్మాపురంలో పోలింగ్ బూత్ ఏర్పాటు కోసం, సౌకర్యాల పరిశీలన కోసం సందర్శించారు. గ్రామంలో సుమారు 28 ఇళ్లు, 120 మంది జనాభా, 69 మంది ఓటర్లు ఉన్నారు. గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనాన్ని పరిశీలించారు. గ్రామంలో సౌకర్యాలు, రాకపోకలకు ఇబ్బందులు తలెత్తడంతో పోలింగ్ కేంద్రాన్ని గ్రామంలోనే ఏర్పాటు చేసేందుకు స్థల పరిశీలన చేశారు. దూరభారం, వర్షాలు పడితే దొరవారితిమ్మాపురం ప్రజలు ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం ఉండదు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో దొరవారి తిమ్మాపురం ప్రజలు గ్రామం నుంచి మట్టేవాడకు చేరుకుని తమ ఓటుహక్కును వినియోగించుకునే వారు. గ్రామస్థులు సైతం దొరవారితిమ్మాపురంలోనే పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని అధికారులకు మొరపెట్టుకున్నారు. గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేదని, విద్య, వైద్యం కూడా అందడం లేదని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు స్పందించిన అధికారులు గ్రామ సమస్యను జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేయనున్నట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

గూడూరు, అక్టోబరు 5 : మండలంలోని బొల్లెపల్లి పెట్రోల్ సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడడంతో ఇరువురికి తీవ్రగాయలైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ధర్మాతండాకు చెందిన బోడ మోహన్, భూక్య బాలు ఒకే ద్విచక్రవాహనంపై మహబూబాబాద్ జిల్లా గూడూరు మీదుగా కేసముద్రంకు వెళ్తున్నారు. బొల్లెపల్లి శివారు పెట్రోల్ పంప్ వద్దకు రాగానే ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో కిందపడ్డారు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అందుబాటులో ఉన్న పాత్రికేయుడు బోడ రాజు 108కు సమాచారం అందించి చికిత్స నిమిత్తం గూడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సామాజిక న్యాయం కోసం కేవీపీఎస్ పోరాటం



కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 5 : సామాజిక న్యాయం కోసం కుల వివక్ష వ్యతిరేక పోరాటసంఘం (కేవీపీఎస్) పోరాటాలు కొనసాగిస్తుందని ఆసంఘం జిల్లా కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కుర్ర మహేష్ అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ 29,30 వార్డుల్లో కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. సీనియర్ నాయకులు రాయికంటి సమ్మయ్య, వేమూరి నర్సయ్య సంఘం జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంటరానితనం మహానేరమని మహాత్మాగాంధీ ఇచ్చిన స్ఫూర్తితో 2 అక్టోబరు 1998న ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన లక్ష్యంగా కేవీపీఎస్ ఆవిర్భవించిదని చెప్పారు. ఈ కార్యక్రమంలో చీపిరి యాకయ్య, మచ్చ వెంకన్న, నూనె శ్రీనివాస్, బేతమల్ల విజయ, దైద సురేందర్, మట్టి నరేష్, శాగంటి భాగ్యమ్మ, రాజు, శంకర్, సుమలత, అయోధ్య, స్వరూప, యాకలక్ష్మి, చింటూ, శ్రావణి, సునిత, వీరన్న పాల్గొన్నారు.

ఎర్రజెండాతోనే సమస్యలు పరిష్కారం

● సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజమౌళి



తోట బిక్షం నగర్ శాఖ మహాసభలో మాట్లాడుతున్న రాజమౌళి

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 5 : ప్రజాసమస్యల పరిష్కారం ఎర్రజెండాతోనే సాధ్యమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి అన్నారు. మహబూబాబాద్ పట్టణ శివారు తోట బిక్షంనగర్ సీపీఎం శాఖ మహాసభను శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా హాజరైన రాజమౌళి మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వం మత కలహాలు సృష్టించి ప్రజల మధ్య చిచ్చు పెడుతుందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల అభ్యున్నతికి పాటుపడడంలో విఫలమైందని ఆరోపించారు. అకాల వర్షానికి నష్టపోయిన కుటుంబాలకు పరిహారం అందించడంలో జాప్యం తగదదని హితవు పలికారు. ఈ మహాసభలో అల్లి శ్రీనివాస్‌రెడ్డి, హేమనాయక్, సురేష్, రేణుక, రషీద్, అనిత పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి..

కృషి చేసిన మహానీయుడు వెంకటస్వామి

● కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



జి.వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన మహానీయులు గడ్డం వెంకటస్వామి అని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం దివంగత గడ్డం వెంకటస్వామి (కాకా) జయంతి వేడుకను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, పార్లమెంట్ సభ్యులుగా, రాష్ట్ర మంత్రిగా, కేంద్ర మంత్రిగా వివిధ హోదాల్లో పని చేసిన గడ్డం వెంకటస్వామి ప్రజాభ్యున్నతే లక్ష్యంగా పని చేశారని చెప్పారు.అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా అధికారులు నర్సింహాస్వామి, వెంకటేశ్వర్లు, సురేష్, మరియన్న, విజయనిర్మల, బాలకిషన్ పాల్గొన్నారు.

సీఆర్టీల ఖాతాల్లో రూ. 36,255 జమ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 5 : జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న 108 మంది కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్ (సీఆర్టీ)ల వేతనాలు ఒక్కొక్కరి బ్యాంకు ఖతాల్లో రూ. 36,255 శనివారం జమ అయ్యాయి. ఈనెల 4న ఆంధ్రజ్యోతి జిల్లా టాబ్లాయిడ్‌లో 'పండుగ నాటికైనా జీతాలు వచ్చేనా'..? అనే కథనం ప్రచురితమైన విషయం విధితమే. స్పందించిన గిరిజన సంక్షేమశాఖ అధికారులు జిల్లాలో విధులు నిర్వహిస్తున్న సీఆర్టీల వేతనాలను మంజూరు చేసి వారి ఖాతాల్లో జమచేశారు. సీఆర్టీలకు ప్రతీనెల రూ.28,977 వేతనం వస్తోంది. కాగా, ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు వేతనాలు రావాల్సి ఉంది. ఈనెల 5న సాయంత్రం రూ.36, 255 వేతనాలు అకౌంట్లలో జమ అయినట్లు సీఆర్టీలు తెలిపారు.

ఘనంగా శతరుద్రాభిషేకం



ఆర్యవైశ్యభవన్‌లో శతరుద్రాభిషేకం పూజలు నిర్వహిస్తున్న దంపతులు

కేసముద్రం, అక్టోబరు 5 : కేసముద్రం స్టేషన్ ఆర్య వైశ్య భవన్ దేవీనవరాత్రి ఉత్సవాల్లో శనివారం శ్రీమాత వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో వాసవి మిత్రమండలి ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక శతరుద్రాభిషేకాన్ని నిర్వహించారు. వంద జంటలతో కూడిన 200 మంది దంపతులు ఈ పూజల్లో పాల్గొని హోమం, కుంకుమ పూజ, రుద్రాభిషేకం జరిపించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వోలం ప్రభుకిరణ్, సామ ప్రసాద్, తాటికొండ సాగర్, మాలె రవి, వోమ సంతోష్, బోగోజు నాగేశ్వరాచారి, వేణుగోపాలాచారి, లెంకలపల్లి సంతోష్, చిల్లంచర్ల సతీష్, సామ ప్రకాశ్, రాపోలు శ్రీనివాస్, శ్రీరాం చంద్రన్, కిరణ్, బోనగిరి శ్రీకాంత్ పాల్గొన్నారు.

చంద్రుగూడెంలో భూబాధితుల నిరసన

గూడూరు, అక్టోబరు 5 : చంద్రుగూడెంలో శనివారం భూ బాధితులు నిరసన వ్యక్తం చేశారు. ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల నిర్మాణానికి ప్రభుత్వం 8 ఎకరాల భూమిని కేటాయించింది. ఆ భూమిలో అనేక సంవత్సరాలుగా గిరిజన రైతులు వివిధ పంటలను సాగు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. గూడూరుకు ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల మంజూరు కావడంతో భవన నిర్మాణం కోసం భూమి ని కేటాయించారు. భూ బాధితులు కోర్టును ఆశ్రయించగా తాత్కాలికంగా పనులు నిలిపివేయాలని అధికారులను కోర్టు ఆదేశించినట్లు రైతులు తెలిపారు. ఆ భూమిలో భవన నిర్మాణం కోసం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రేకులషెడ్డుతో పాటు ప్రారంభోత్సవ శిలాఫలకం పాక్షికంగా దెబ్బతిని ఉంది. ఇది భూ బాధితులే చేసి ఉంటారని అధికారులు బావిస్తున్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు ధ్వంసమైన శిలాఫలకం వద్దకు వెళ్లి పరిశీలించారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి

● రైతులకు రూ.2లక్షల రుణమాఫీపై మోసం

● మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

తొర్రూరు, అక్టోబరు 5 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. శనివారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నూకల నరేశ్‌రెడ్డి గుండెపోటుతో మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెంలో పరామర్శించి, వస్తుండగా తొర్రూరులో బీజేపీ కార్యకర్తలు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఆరుగ్యారంటీలు, రుణమాఫీ, పెన్షన్ల పెంపు, అర్హులైన మహిళలకు రూ. 2వేల భృతి, తదితర హామీలు ఇచ్చి ఎన్నికల్లో గెలిచిన తర్వాత ప్రజలను మోసం చేస్తుందని, హామీలు అమలు చేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించడం ఖాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో పేదల ఇళ్లు కూల్చి వేస్తుందని దుయ్యబట్టారు. మూసీ సుందరీకరణ పేరుతో వేలకోట్ల రూపాయల కుంభకోణానికి తెరలేపారని విమర్శించారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న ప్రజలందరూ పట్టాదారులే అని, వారిని అన్యాయంగా అక్కడి నుంచి ఖాళీ చేయించడం చట్ట విరుద్ధమన్నారు. ఆగస్టు 15లోపు రూ2లక్షల రుణమాఫీ చేస్తామని దేవుళ్లపై ఒట్టువేసి రైతులను మోసం చేశారని, రాష్ట్రవ్యాప్తంగా 22 లక్షల మందికి రుణమాఫీ చేశామని చెప్తున్న కాంగ్రెస్ నాయకులు రైతుల వివరాలు బయట పెట్టాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 శాతం కూడా రుణమాఫీ కాలేదని, వందశాతం రుణమాఫీ అయ్యేంత వరకు రేవంత్‌రెడ్డిని వదిలిపెట్టే ప్రసక్తిలేదని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యకర్తలు క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేస్తూ కేంద్రప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాలన్నారు. సభ్యత్వ నమోదును వేగవంతం చేస్తూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. నాయకులు పల్లె కుమార్, చీకటి మహేష్, పూర్ణచందర్, కాగు నవీన్, రాజేష్, విష్ణువర్ధన్, శ్రీనాథ్, శివ, మురళి ఉన్నారు.

'శ్రీవేట వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి పాటుడాలి'



శ్రీవేట వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల కరపత్రాలను వడుదల చేస్తున్న కనకయ్య

గార్ల అక్టోబర్ 5 : కోరిన వారికి కొంగు బంగారంలా పిలవబడే గార్ల వేట వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి అందరూ పాటు పడాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. శనివారం మర్రిగూడెం సమీపంలో శ్రీవేట వేంకటేశ్వరస్వామి ఆలయాని వచ్చిన అయనకు అధికారులు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకొని, ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు జరిపారు. దేవాదాయ శాఖ కార్యనిర్వాహక అధికారిని సమత, అర్చకులు ఆయనను శాలువాతో సన్మానం చేసి, ధ్వజ స్తంభం ప్రతిష్ఠాపన స్వామివారి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేట వేంకటేశ్వర దేవాలయం మహా పుణ్యక్షేత్రం వలే భక్తులతో కళకళలాడాలన్నారు. దేవాలయం అభివృద్ధి దాతల సహకారం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, రైల్వే మాజీ ఉన్నతాధికారి భూక్యా కస్నానాయక్, పల్లఖండం రమేష్‌బాబు, పర్చూరి కుటుంబరావు, మల్లం నరేందర్, ఇందుర్తి వెంకట్‌రెడ్డి, మన్నేపల్లి వెంకయ్య, మాజీ ఎంపీపీ రూపాబాబు, మండా రాముగౌడ్, డి.రామారావు పాల్గొన్నారు.

దుర్గాదేవి మండపాల వద్ద అన్నదానం

మర్రిగూడెంలోని భూక్యా కాంతారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ ఆవరణలో భక్తులకు అన్నదాన్ని ఎమ్మెల్యే కనకయ్య ప్రారంభించారు. గార్లలోని ఏవీఆర్ పంక్షన్‌హాల్ సమీపంలో గుగులోత్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దుర్గాదేవి మండపం వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వోబిలిశెట్టి లక్ష్మీనర్సయ్య, గోదా గోపాల్‌జైన్, ఉష పాల్గొన్నారు.

'ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాడాలి'



నెల్లికుదురు, అక్టోబరు 5 : ప్రజాసమస్యల పరిష్కానికి పోరాటాలే మార్గమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గునిగంటి రాజన్న తెలిపారు. మండలంలోని నైనాలలో శనివారంసీపీఎం గ్రామ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం దోపిడీ వ్యవస్థను ప్రోత్సహిస్తుందని, ప్రభుత్వ ఆర్థిక సొత్తును మింగుతూ పాలన కొనసాగిస్తుందన్నారు. రైతులకు ఎరువులపై సబ్సిడీ ఇవ్వాలన్నారు. సీపీఎంమండల కార్యదర్శి పెరమాండ్ల తిలక్‌బాబు, బాబుగౌడ్, ఇసంపెల్లి సైదులు, తోటనర్సయ్య రామరాజు సమ్మయ్య, బానాల యాకయ్య, బత్తిని వెంకన్న, పుల్లయ్య తోట శ్రీనివాస్, వెంకన్న, సునిల్ పాల్గొన్నారు.

అభ్యర్థులకు రోస్టర్ పాయింట్స్ అమలు చేయాలి

● ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 5 : డీఎస్సీ-2024 నియామకాల్లో ఎస్సీఎస్టీ అభ్యర్థులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్స్ యొక్క రోస్టర్ పాయింట్లను కచ్చితంగా అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఫాతిమా హైస్కూల్‌లో శనివారం ఐదవ రోజు కొనసాగుతున్న డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలిక కేంద్రాన్ని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం, గిరిజన టీచర్స్ ఫెడరేషన్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభాకర్ మాట్లాడుతూ..ఇటీవల జరిగిన ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల పదోన్నతుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ నిబంధనలు అధికారులు పాటించకపోవడంతో అన్యాయం జరిగిందన్నారు. ప్రస్తుతం చేపడుతున్న డీఎస్సీ నియామకాల్లో అయినా రూల్ ఆఫ్ రిజర్వేషన్ నియమ నిబంధనలు పాటించి చట్ట ప్రకారం వారికి వర్తించే అవకాశాలను అమలుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పార్నంది రామయ్య, మాలోతు శివనాయక్, మాలోతు భద్రు, భాస్కర్, సర్దార్, రవీందర్ పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం



పార్టీ సభ్యత్వాలను చేయిస్తున్న బీజేపీ నాయకులు

కేసముద్రం, అక్టోబరు 5 : మండలంలోని ధన్నసరి, అర్పనపల్లి, కేసముద్రం స్టేషన్‌ల లో శనివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండల పార్టీ అధ్యక్షుడు పొదిల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్ నిర్మాణంలో భాగంగా ప్రతీ ఒక్కరు ప్రధాని మోదీ సారథ్యంలోని బీజేపీ కుటుంబంలో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. జిల్లా కన్వీనర్ లక్ష్మణ్‌నాయక్, మండల ఇన్‌చార్జ్ మెరెడ్డి సురేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు తుంపిళ్ల శ్రీనివాస్, గాంతి వెంకట్‌రెడ్డి, బోనగిరి ఉపేందర్, ఉప్పునూతల రమేష్, సింగంశెట్టి మధుకర్, నవనీత్ పాల్గొన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

● మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర, అక్టోబర్5 : నియోజకవర్గ ప్రజలను, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు చిలుక ఎల్లమ్మ (60) అనారోగ్యంతో మరణించడంతో శనివారం మృతురాలి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతురాలి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. పరామర్శించిన వారిలో మాజీ పాలకుర్తి దేవస్థాన చైర్మన్ వి రామచంద్రయ్యశర్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదరు ఐలయ్య, శ్రీరాం సుధీర్, శ్రీరాం సంజయ్, దుంపల సమ్మమయ్య, శ్రీరాం రాము, వెంకన్న, భిక్షపతి, హరీష్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కొత్తగూడ, అక్టోబరు 5 : కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్క భరోసా ఇచ్చినట్టు ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు బోడ ఈర్యానాయక్ పేర్కొన్నారు. మైలారంతండాలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బాదావత్ స్వామి ఇటీవల మృతి చెందగా, మృతుడి కుటుంబానికి మంత్రి సీతక్క ఆదేశాల మేరకు రూ.9,500ను బోడ ఈర్యానాయక్ ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక సహాయం చేశారు. స్వామికుటుంబాన్ని మంత్రి ఆదుకుంటానని హామీ ఇచ్చినట్టు ఈర్యానాయక్ తెలిపారు. తండాపెద్ద బానోత్ వీరన్న, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఈర్యా, నాయకులు బానోత్ రవీందర్, సుమన్, చందు, బోడ దేవా, లాలు, బానోత్ శంకర్ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు

తొర్రూరు, అక్టోబరు 5 : పట్టణంలోని వివిధ ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలల్లో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, సమత కళాశాల కరస్పాండెంట్ రఘునాథరెడ్డి మాట్లాడారు. బతుకమ్మ పండుగను తెలంగాణ వ్యాప్తంగా ఎలాంటి తారతమ్యాలు లేకుండా ఉత్సాహంగా జరుపుకునే సంప్రదాయం ఉందన్నారు. విద్యార్థినులు సంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ నారాయణ, సువర్ణ, అన్నపూర్ణ, సమత కళాశాల ప్రిన్సిపాల్ వెంకన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎడ్యూకేషన్‌లో రఘునాథరెడ్డికి డాక్టరేట్



డాక్టరేట్ పట్టాను అందుకుంటున్న రఘునాథరెడ్డి

తొర్రూరు, అక్టోబరు 5 : పట్టణ కేంద్రానికి చెందినవై.రఘునాథరెడ్డి మధ్యప్రదేశ్‌లోని భోపాల్ మానస సరోవర్ గ్లోబల్‌యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ సాధించారు. శుక్రవారం రఘునాథరెడ్డికి యూనివర్సిటీ రిజిస్ట్రార్ పట్టా అందించారు. పట్టణంలోని డీఆర్ఎస్ బీఈడీ కళాశాల ప్రినిపాల్‌గా వ్యవహరిస్తున్న రఘునాథరెడ్డి ఎడ్యుకేషన్ విభాగంలో మెథడాలజీ స్టడీఆన్ కోరలేషన్ బిట్వీన్ మెంటల్ హెల్త్ అండ్ ఎమోషనల్ ఎథిక్స్‌పై అకాడమిక్ ఇయర్‌లో పీహెచ్‌డీని డాక్టర్ రాజ్‌కిషోర్ పాటక్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ప్రిన్సిపాల్‌గా ఉండి పీహెచ్‌డీని పూర్తిచేసి డాక్టరేట్ అందుకోవడం అభినందనీయమని కళాశాల బృందం, స్నేహితులు, కుటుంబసభ్యులు పలువురు ఆయనను అభినందించారు.

బైకు అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వర్ధన్నపేట, అక్టోబరు 5 : కోతులు అడ్డం రావడంతో బైక్ అదుపుతప్పి వ్యక్తి గాయాలై ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న ఘటన శనివారం వర్ధన్నపేటలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం. మహబూబాబాద్‌కు చెందిన పరశురాములు మహబూబాబాద్ నుంచి వరంగల్‌వైపు ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. వర్ధన్నపేటలో కోతులు వాహనానికి అడ్డురాగా, బ్రేక్ వేయడంతో బైక్ అదుపు తప్పి కిందపడి పోయాడు. గాయపడిన పరశురాములును స్థానికులు వర్ధన్నపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతున్నాడు.

నరేష్‌రెడ్డి అంతిమయాత్రకు తరలిన నాయకులు

కురవి, అక్టోబరు 5 : గుండెపోటుతో మృతి చెందిన నూకల నరేష్‌రెడ్డి అంతిమయాత్రకు మండలం నుంచి వివిధ పార్టీల నాయకులు తరలివెళ్లి, నివాళులు అర్పించారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు వీరభద్రం, మాజీ జడ్పీటీసీ బండి వెంకట్‌రెడ్డి, నూకల వేణుగోపాల్‌రెడ్డి, అవిరె మోహన్‌రావు, గార్లపాటి వెంకట్‌రెడ్డి, బాదావత్ రామునాయక్, వివిధ పార్టీల నాయకులు తరలివెళ్లారు.

ఎరువుల దుకాణాల్లో వ్యవసాయశాఖ అధికారుల తనిఖీలు

గూడూరు, అక్టోబరు 5 : మండల కేంద్రంతో పాటు తీగలవేణి, బొద్దుగొండ గ్రామాలల్లోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి విజయనిర్మల శనివారం తనిఖీలు చేపట్టారు. దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ పాస్ ద్వారానే రైతులకు నాణ్యమైన ఎరువులను అందించాలన్నారు. విక్రయించిన ఎరువులను స్టాక్ రిజిస్టర్లలో నమోదు చేయాలని చెప్పారు. మండల వ్యవసాయశాఖ అధికారి అబ్దుల్ మాలిక్, ఏఈవోలు పాల్గొన్నారు.

అడ్వకేట్స్ కాలనీలో టవర్‌ను తొలగించాలి

మహబూబాబాద్‌టౌన్, అక్టోబరు5 : పట్టణంలోని అడ్వకేట్స్ కాలనీలో ప్రజలు సెల్ టవర్‌తో ఇబ్బందులు పడుతున్నారని, దానిని తొలగించాలని సీపీఐ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి విజ్ఞప్తి చేశారు. మునిసిపల్ కార్యాలయంలో అడ్వకేట్స్ కాలనీవాసులు కమిషనర్ రవీందర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ సెల్‌టవర్ సిగ్నల్స్‌తో ప్రజలు అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదముందని, తక్షణమే దానిని తొలగించి కాలనీవాసులకు మేలు చేయాలని కోరారు. వార్డుకౌన్సిలర్ నీరజ, అడ్వకేట్స్‌కాలనీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు పల్లా రాంచంద్రారెడ్డి, చీకటి తిరుమలేష్, బిడుదుల గోపాల్, బోనగిరి ప్రసాద్, ప్రశాంత్, సూర్యప్రకాష్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కోమటిపల్లిలో బొమ్మల కొలువు

● ప్రతిబింబిస్తున్న తమిళ సంస్కృతి

● చెక్కుచెదరని 400 ఏళ్లనాటి బొమ్మలు

కేసముద్రం, అక్టోబరు 5 : తెలంగాణ రాష్ట్రం అంతటా బతుకమ్మ, దసరా పండుగల సందడి నెలకొని ఉండగా, ఇందుకు భిన్నంగా ఇనుగుర్తి మండలం కోమటిపల్లిలో తమిళ సంస్కృతిలో బొమ్మలు కొలువుదీరాయి. గ్రామంలో ఆనాధిగా కురత్తాళ్వార్ వంశస్థులు ఏర్పాటు చేస్తూ వస్తున్న బొమ్మల కొలువు కన్నుల పండువగా కొనసాగుతోంది. 400 ఏళ్ల క్రితం ఈ గ్రామంలో గురుపీఠం ఏర్పాటు చేశారు. గురుపీఠాన్ని ఆధారంగా చేసుకుని శతాబ్దం క్రితం తమిళనాడులోని శ్రీరంగం నుంచి వలస వచ్చిన కురత్తాళ్వార్ వంశంలోని భట్టర్ కుటుంబాలు ఇక్కడ స్థిర పడ్డాయి. ఏటా అమావాస్య మరుసటి రోజు ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి ఆశ్వయుజ శుద్ధ దశమి (విజయదశమి) వరకు బొమ్మల కొలువు నిర్వహిస్తారు. ఈ బొమ్మల్లో శ్రీ కృషజన్మ వృత్తాంతం, దశావతారాలు, అష్టలక్ష్మిలు విగ్రహాలతో పాటు వివిధ వృత్తుల్లోని బొమ్మలను ఏర్పాటు చేశారు. గ్రామంలోని శ్రీవేదవ్యాస లక్ష్మమ్మాళ్, శ్రీవేదవ్యాస మాధవి,వాగ్విజభట్టర్, శ్రీవేదవ్యాస ఉషారాణి, బల్లవరం గాయత్రికృష్ణమాచార్యులు, అల్వందార్ సంపత్కుమారాచార్యులు ఇళ్లలో ఈ బొమ్మలు కొలువుదీరాయి.

నాలుగు శతాబ్దాల నాటి బొమ్మలు..

బొమ్మల కొలువులో అగ్రభాగంలో ఏర్పాటు చేసిన కొన్ని 400 ఏళ్ల నాటి వేంకటేశ్వరస్వామి, అలివేలుమంగ, గోదాదేవి బొమ్మలు చెక్కుచెదరకుండా ఉండడం విశేషం. తాళపత్రగ్రంథాలు, పూర్వీకుల సాహిత్య రచనలను ప్రత్యేకంగా పేర్చి సరస్వతి పూజ నిర్వహిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన కొందరు ఈ బొమ్మల కొలువు వేడుక కోసం ఇక్కడే తొమ్మిది రోజుల పాటు ఉంటారు. ప్రతీరోజు పిల్లలు, పెద్దలు ఆయుధ, లక్ష్మి, ధాన్య పూజలు నిర్వహిస్తూ బొమ్మలను పూజిస్తున్నారు. చివరి రోజైన విజయదశమి నాడు గ్రామస్థులను ఆహ్వానించి వాయినాలు ఇచ్చి, బొమ్మలతో ఆశీర్వచనాలు ఇప్పించి వాటిని కదిలిస్తారు. బతుకమ్మ, బొమ్మల కొలువులతో గ్రామంలో తెలంగాణ, తమిళ సంస్కృతిక సమ్మేళనాన్ని ఆవిష్కరిస్తున్నాయి.



కోమటిపల్లిలో తమిళనాడు సంస్కృతిలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

సంస్కృతిని కాపాడుకుంటున్నాం..

శ్రీవేదవ్యాస లక్ష్మమ్మాళ్, కోమటిపల్లి



కురత్తాళ్వార్ వంశం నుంచి ఈ ఆచారాన్ని 400 ఏళ్లుగా కాపాడుకుంటూ ప్రస్తుత 49వ తరం కొనసాగిస్తోంది. తమిళనాడు వలస వచ్చిన తమ కుటుంబాలకు ఈ బొమ్మల కొలువు ఆచారంగా కొనసాగుతోంది. బొమ్మల కొలువు వల్ల పిల్లలు, పెద్దల్లో ఆధ్యాత్మిక భావన పెంపొందుతుంది. వారసత్వంగా వచ్చిన నాలుగు శతాబ్దాల నాటి బొమ్మలతోపాటు పుణ్యక్షేత్రాల నుంచి కొనుగోలు చేసి తీసుకువచ్చిన బొమ్మలను ఈ కొలువులో ఏర్పాటు చేస్తున్నాం.